అతుకుల బొంతల్లా..


శిథిలమైన బీసీ కాలనీ పాఠశాల రోడ్డు



కోరుకుపోయిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు

కల్వర్టులు శిథిలం

అవస్థలు పడుతున్న ప్రజలు


జాతీయ రహదారి నుంచి బీసీ కాలనీ వెళ్లే మార్గంలో కల్వర్టు దుస్థితి

అగనంపూడి:కొండవాలు ప్రాంతంలో రోడ్లు అతుకుల బొంతల్లా మారాయి. దీంతో ప్రజలు శిథిలమైన రోడ్లపై ఫీట్లు చేస్తూ పాట్లు పడుతున్నారు. రెండు దశాబ్దాల కిందట యూజీడీ పథకంలో భాగంగా నిర్మించిన సీసీరోడ్లు, కల్వర్టులు ఎక్కడికక్కడే శిథిలం అయ్యాయి. దీంతో జీవీఎంసీ 85వ వార్డు బీసీకాలనీ, ఉప్పరకాలనీ, అట్టవానిపాలెం నిర్వాసితకాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మేజర్ పంచాయతీగా ఉన్న అగనంపూడి 2005లో జీవీఎంసీలో విలీనం అయింది. అప్పట్లో ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మూడు వందల కోట్ల రూపాయలతో అగనంపూడి, దువ్వాడ నిర్వాసితకాలనీల్లో యూజీడీ లైన్లు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ రోడ్లు నిర్మించారు. అప్పటి జనాభా, ఆవాసాలకు అనుగుణంగా రహదారులు నిర్మించారు. కాలక్రమేనా జనాభా పదింతలు పెరగడం, వాహనాలజోరు పెరగడంతో పాటు తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకపోవడం వల్ల సీసీరోడ్లు, కల్వర్టులు ఎక్కడికక్కడే శిథిలమయ్యాయి. కోతకు గురయ్యాయి. ప్రధాన డ్రైనేజీల వద్ద రోడ్డు కోరుకుపోయింది. దీంతో అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పినమడక, కర్రివానిపాలెం నుంచి బీసీ కాలనీ ప్రధాన రహదారి నాలుగు రోడ్లు కలిసే ప్రతీ చోట కల్వర్టులు శిథిలమయ్యాయి. జాతీయ రహదారి నుంచి బీసీకాలనీకి వెళ్లే మొదటి రోడ్డు, రెండో రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు, రామాలయం జంక్షన్, దుర్గాలమ్మ ఆలయం ఎదురుగా అట్టవానిపాలెం వెళ్లే మార్గంలో మాజీ సర్పంచ్ దాసరి సూరిబాబు ఇంటి వెనుక రోడ్లు మలుపులో ఇలా దాదాపు అన్ని రోడ్లు అధ్వానంగా మారాయి.దీంతో రాత్రి వేళల్లో నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని కాలనీవాసులు మండిపడుతున్నారు.

నిత్యం అవస్థలు



జీవీఎంసీ పట్టించుకోదు. ఇటు పాలకులు కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.దీంతో రోడ్లు దెబ్బతిన్నాయి. దశాబ్దం నుంచి ఈ మార్గాల్లో స్థానికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రాత్రి వేళల్లో నడిచి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి. వీధి దీపాలు కూడా అంతంత మాత్రంగా వెలుగుతున్నాయి. నిత్యం అవస్థలు పడుతున్నాం. – కొలిపాక అప్పారావు, పెదమడక

కల్వర్టులు, డ్రైనేజీలు దారుణం

కర్రివానిపాలెం నుంచి సాయిబాబా మందిరం, పైడిమాంబ ఆలయం వరకు ఉన్న ప్రధాన రహదారి ప్రతీ కూడలి వద్ద రోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నాలుగు రోడ్ల కూడళ్లలో మరీ దారుణంగా ఉన్నాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించి పునర్నిర్మాణం చేపట్టాలి.

– బలిరెడ్డి నాగేశ్వరరావు, కొండయ్యవలస



మరమ్మతులు చేయాలి

బీసీకాలనీలో నాలుగు దశాబ్దాల కిందట లేఅవుట్ వేయడంతో 20 అడుగులుగా ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి మినహా వీధిరోడ్లు రెండు వైపులా కుదించుకుపోయాయి. కల్వర్టులు విరిగిపోవడం, డ్రైనేజీలు శిథిలం కావడంతో రాకపోకలకు ఆపసోపాలు పడాల్సివస్తోంది. పాలకులు పట్టించుకుని మరమ్మతులు చేపట్టాలి.

–నక్కా రమణబాబు, బీసీకాలనీ



టిడ్కో ఇళ్లు కేటాయించాలని ఆందోళన


ప్లకార్డులతో టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సమీపంలోని మంగళపాలెంలో నిర్మించిన టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళపాలెంలోని గృహ సముదాయం వద్ద నిరుపేదలతో కలిసి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ అర్హులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. లబ్ధిదారులు గృహాల కోసం కొంత మొత్తం డిపాజిట్ చేసినప్పటికీ గృహాలు కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. మరో వైపు గృహ రుణాల వాయిదాలు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని.. ఇళ్లు అప్పగించకుండా రుణాలు ఎలా చెల్లిస్తారని నిలదీశారు. మౌలిక వసతులు కల్పించి తక్షణం లబ్ధిదారులకు కేటాయించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, శ్రీనివాసరావు, గోపి. నరేష్, తిరుపతిరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు


చేపల మార్కెట్‌లో అవగాహన కల్పిస్తున్న తిరుముల నగర్ వాసులు

కూర్మన్నపాలెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తిరుమల నగర్ సంక్షేమ సంఘ సభ్యులు తెలిపారు. వడ్లపూడిలో ఆదివారం ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారులు,కాలువల్లో ప్లాస్టిక్ సంచులు వేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వాతావరణ కాలుష్యం ఏర్పడి క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయన్నారు. చేపల మార్కెట్‌లో ప్రతి దుకాణం వద్దకు వెళ్లి గుడ్డ సంచులు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు పరమానంద్,నాగభూషణరావు, శ్రీరాములు, సన్యాసిరావు, వసంత రెడ్డి,కామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి సహస్రనామార్చన


పూజలందుకున్న తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశుడికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం స్వామిని విభిన్న పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

ఘనంగా దుర్గాదేవి మహోత్సవం


అమ్మవారికి పూజలు చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: సిద్ధార్థనగర్‌లో దుర్గాదేవి మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, బీసీ సెల్ అధ్యక్షుడు చిత్రాడ వెంకటరమణ తదితరులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.

ఎమ్మెల్యే పల్లా దృష్టికి వుడా కాలనీ సమస్యలు

పెదగంట్యాడ: మండలంలోని వుడాకాలనీ వినాయకనగర్ సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్తామని వినాయకనగర్ కాలనీ హౌసింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వుడా కాలనీ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు వుడా కాలనీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వుడా కాలనీలోని ఆదర్శగ్రౌండ్‌లో ఉన్న పాఠశాల లీజు ముగియడంతో వుడా కాలనీకి చెందిన భవనాన్ని ఆ పాఠశాలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఆ భవనాన్ని తమ కాలనీ వాసుల కోసం కేటాయించాలని కోరారు. సమావేశంలో గుడివాడ అమ్మన్న, ఎం.సత్యనారాయణ, మోహనరావు, రాము, కేశవరావు, తేజ, శంకరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

బీసీల అభివృద్ధికి కృషి

సీతమ్మధార: బీసీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నక్కల్లా నరసింహారావును నియమించినట్లు చెప్పారు. అనంతరం బీసీ సంఘం నాయకులంతా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు నూకాలమ్మ, మల్లేష్, నాగేశ్వరరావు, వేణు, రమణ వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

207 మందికి వైద్య సేవలు


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు


శిబిరంలో పాల్గొన్న బాధితులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని దివ్యజ్యోతి భవనంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య, నేత్ర శిబిరానికి విశేష స్పందన లభించింది. వేద నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని దువ్వాడ ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు ప్రారంభించారు. విశ్వశాంతి, విశ్వ కల్యాణం కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 207 మంది వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పంకజ్ డోంగ్రి, బెల్లాల కీర్తి, అగనంపూడి బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రామకోటి, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు పయనం


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కరణంరెడ్డి

గాజువాక: ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి యూనివర్సిటీల కిక్‌బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు బయల్దేరిన ఏయూ, జీఎస్‌టీయూ క్రీడాకారులను కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అభినందించారు. రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీల నుంచి ఆరుగురు క్రీడాకారులు ఈ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వారు విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్‌లు ప్రవీణ్ కుమార్, నూకరాజు, కోచ్‌లు ఆనంద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కరుణించు.. పైడిమాంబ

- వైభవంగా నవరాత్రి మహోత్సవాలు
- 18న ప్రధాన పండగ, అనుపు ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో కొలువైన పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఒకప్పుడు నడుపూరు పరిసర ప్రాంతాల గ్రామ దేవతగా విరాజిల్లారు. ఇప్పుడు నిర్వాసిత కాలనీలు, గ్రామాలు వెలియడంతో ప్రతి ప్రాంతంలో పదుల సంఖ్యలో ఆలయాలు వెలిసాయి. నడుపూరు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని ఇలువేల్పుగా కొలుస్తున్నారు. జాతర మహోత్సవాలను కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు చెబుతున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలు

ప్రతి ఏటా పాల్గుణ మాసం మూడో మంగళవారం పైడిమాంబ పండగ నిర్వహిస్తారు. ఈ నెల 11న ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు 18వ తేదీ మంగళవారంతో ముగియనున్నాయి. వేడుకల్లో భాగంగా నిత్యం పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు అభిషేకాలు, కుంకుమార్చనలు, సహస్ర నామ పారయణం, భజనలు చేస్తున్నారు.

ఇలవేల్పుగా పూజలు

సుమారు శతాబ్ద కాలం నుంచి ఈ ప్రాంతాలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పైడిమాంబను తమ ఇలవేల్పుగా కొలుస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ రాకముందు నుంచి నడుపూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పైడిమాంబను గ్రామదేవతగా కొలిచేవారు. అమ్మవారికి చీరలు చూపించి మొక్కులు చెల్లించుకునేవారు.


ముస్తాబైన అమ్మవారి ఆలయం

విస్తృత ఏర్పాట్లు

మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారికి పూజలు చేసేందుకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి పరస, జాతర ప్రారంభమై రాత్రి వరకూ కొనసాగుతుంది. మంగళవారం సాయంత్రం వరకూ భక్తులు తాకిడి ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో న్యూపోర్టు పోలీసులు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఆలయ ఆవరణతో పాటు గ్రామం నలుమూలల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు


శీతల పానీయాలు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు


అగనంపూడి సత్రం కూడలిలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న రామారావు

అగనంపూడి: భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు, ఆంధ్ర రాష్ట్ర వ్యవస్థాపన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడు పొట్టి శ్రీరాములు అని వాసవీ క్లబ్ జిల్లా చైర్మన్ మయూరి బుజ్జి (వుడా సత్యనారాయణ) అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా అగనంపూడి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత జాతీయ రహదారి కూడలిలో శీతల పానీయాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అగనంపూడి ప్రతినిధులు పుట్టా రమేష్, సీతామహాలక్ష్మి, సత్తిబాబు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

- 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, ఉక్కు అధికారి కె.రామకృష్ణ, నూకరాజు, టి.కృష్ణ, అప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోర్టు కాలుష్యంతో సతమతం

నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆందోళన


ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక: పోర్టు కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. స్థానిక వై జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యం కారణంగా సుమారు 20 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. సొంతిళ్లలో ఉండలేక, వేరేచోటకు వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. తమను గెలిపిస్తే కాలుష్య నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు ఇటువైపు చూడటం మానేశారని ఆరోపించారు. వై జంక్షన్‌లో భారీ వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంవల్ల ప్రమాదాలు జరిగి అనేకమంది మృత్యువాత పడుతున్నారని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పోర్టు నుంచి బొగ్గు ఎగుమతి, దిగుమతి చేస్తున్న లారీలు కనీస నిబంధనలను పాటించడం లేదన్నారు. ప్రజలు ఊపిరితిత్తు వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్, చర్మవ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ, లోకేష్, బి.రమణ, రాజేంద్రప్రసాద్, లక్ష్మి, శ్రీదేవి, గొలగాని అప్పారావు, సూరిబాబు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


స్టీల్‌ప్లాంట్‌కు 'ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ఎంవీపీకాలనీ: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఎంవీపీ కాలనీ సెక్టార్-5లోని ఐక్యత భవన్‌లో ఆదివారం సీఐటీయూ విశాఖ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే దేశంలోని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, చమురు సంస్థలను వివిధ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కూడా ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారని చెప్పారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన రూ.11,445 కోట్లు ప్లాంట్ అభివృద్ధికి, కార్మికుల జీతాల కోసం కాదన్నారు. కేవలం పాత బ్యాంక్ రుణాలు తీర్చడం కోసమే ఈ నిధులు కేటాయించారని పేర్కొన్నారు. కార్మికుల చట్టాలను సైతం మోదీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, ఏప్రిల్ నుంచి వీటిని అమలు చేయాలని చూస్తోందన్నారు. ఇవి అమలైతే ప్రస్తుతం కార్మికులకు లభిస్తున్న హక్కులన్నీ కోల్పోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వక్తలు స్టీల్‌ప్లాంట్‌కు 'ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, యు.రాజులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాదళ్ సభ్యులకు శిక్షణ


శిబిరంలో మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులకు ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిబాబా దివ్య అవతార శత జయంతి ఉత్సవాలు–2025 సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సేవాదళ్ సభ్యులకు శిక్షణ శిబిరం జరిగింది. ముందుగా పతాక ఆవిష్కరణ, ఓంకారం, వేదం, నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంస్థ రాష్ట్ర సేవాదళ్ జాయింట్ కో–ఆర్డినేటర్ సి.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 6 వేల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వెయ్యి గ్రామాల్లో సేవలు చేయాలని సంకల్పించగా.. ప్రస్తుతం అనేక గ్రామాల్లో జరుగుతున్నాయన్నారు. ఆయా సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ సభ్యులంతా భాగస్వాములుగా నిలవాలని కోరారు. పలువురు జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆద్యంతం రసవత్తరంగా 'భక్త ప్రహ్లాద'

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విశాఖ శ్రీ సాయి కళా నికేతన్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం వారు రాష్ట్ర ప్రభుత్వంచే బంగారు నంది బహుమతి పొందిన 'భక్త ప్రహ్లాద' పౌరాణిక నాటకం ప్రదర్శించారు.

పుట్టిన రోజున ఓ మొక్క నాటండి



సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపకుడు జె.వి.రత్నం

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం(ఎన్‌జీవో) వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున ఓ మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో వైజాగ్‌ను జయప్రదం చేసే దిశగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. వేసవిలో మనం తినే దేశీయ పండ్ల గింజలను ఆరబెట్టి.. వేసవి తరువాత వాటిని కొండలు, తీర ప్రాంతాలు, మొక్కలు పెరగడానికి అనువుగా ఉండే ఇతర ప్రాంతాల్లో చల్లి, సామాజిక వనాలు పెరిగేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు. పశుపక్ష్యాదులకు వేసవిలో నీటిని అందుబాటులో ఉంచడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు పచ్చదనాన్ని పెంపొందించే దిశగా చొరవ తీసుకోవాలని సూచించారు. మానవ జీవనం నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని కోరారు. విద్యార్థులతో కలిసి 'సే నో యూజ్ ప్లాస్టిక్'ఆంగ్ల అక్షరాలను ప్లకార్డులుగా చేతపట్టి, నినాదాలు చేశారు. వార్డెన్ అతవ సత్యవతి, గ్రీన్ వలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.